

సత్వర పరిష్కారమే లక్ష్యం

స్పందనకు 305 అర్జీలు వచ్చాయి. సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



గ్రామాల అభివృద్ధికి చర్యలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం అనకాపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. 8లో



వర్షం జోరు

కె.కోటపాడు/మాడుగుల రూరల్: భారీ వర్షాలు వరి నారుమళ్లకు మేలు చేస్తాయని రైతులు ఆనందపడుతున్నారు.

మారుమూల గ్రామాలు.. బంగారు బాటలు

కుగ్రామాలకు సైతం పక్కా రోడ్లు.. దశాబ్దాల తరబడి తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కోసం ఆశగా ఎదురు చూసిన గిరి ప్రజల కలలు నెరవేరుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ ఆదేశాలు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మాడుగుల నియోజకవర్గం రోడ్ల నిర్మాణంలో దూసుకెళ్తోంది. గత టీడీపీ నాయకుల కళ్లు కుట్టుకునేలా రోడ్లు నిర్మించారని 10 గిరి పంచాయతీలకు చెందిన 102 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- మాడుగుల నియోజకవర్గంలో జోరుగా సాగుతున్న లింకు రోడ్లు
- గిరిజన గ్రామాలకూ పక్కా రహదారుల నిర్మాణం
- రూ.133 కోట్లతో రూపురేఖలు మారేలా చకచకా పనులు



నాడు చీడికాడ మండలం శిరిజాం గిరి గ్రామ రోడ్డు దుస్థితి



నేడు శిరిజాం గ్రామానికి కొత్తగా వేసిన తారు రోడ్డు

మాడుగుల: నేతలు మారుతున్నా రహదారి కష్టాలు ఈ జన్మకు తీరవని ఆశలు వదులుకున్న గిరిజనానికి జగనన్న ప్రభుత్వంలో పక్కా రోడ్లతో ఆశలు తీరుతున్నాయి. గర్భిణులకు, అనారోగ్య బాధితులకు తాత ముత్తాతల కాలం నుంచి పీడిస్తోన్న డోలీ మోతల్ని తప్పించేలా రోడ్లు ఏర్పాటవుతున్నాయి. సీఎం జగన్ సహకారం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మాడుగుల నియోజకవర్గంలో తారు రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం దాదాపు తుది దశకు చేరుకుంది. గ్రామాల నుంచి ప్రధాన రాహదారులకు లింకు రోడ్లు కూడా పూర్తవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాలకు అనుసంధానం

మాడుగుల మండలంలో 80 ఏళ్ల నుంచి కలగానే మిగిలిన డి.గొలివాడ నుంచి 20 కుటుంబాలున్న రాజంపేట గిరి గ్రామానికి రోడ్డు వేయడంతో 14 గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడింది. అల్లూరి జిల్లాకు ఈ రహదారి దగ్గరలో ఉంటుంది. దేవరాపల్లి నుంచి ఆనందపురం వరకు డబుల్ రోడ్డు వేయడంతో దేవరాపల్లి మండల వాసులు విజయనగరం జిల్లాకు వెళ్లేందుకు ఈజీగా మారింది. కె. కోటపాడు మండలం నుంచి పినగాడి వరకు రోడ్డుకు మరమ్మతులు పూర్తిచేయడంతో పెందుర్తికి గతంలో కంటే ప్రయాణం వేగంగా పూర్తవుతోంది. కె.కోటపాడు మండలం పింద్రంగి నుంచి విజయనగరం జిల్లా ముసిరాం వరకు రోడ్డు పూర్తి చేయడంతో రెండు జిల్లాల ప్రజలకు మార్గం అనుసంధానమైంది.

రూ.133 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు

నియోజకవర్గంలో రూ.133 కోట్ల నిధులతో ఇప్పటికే పక్కా రోడ్లతోపాటు సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. గిరి గ్రామాలను అనుసంధానిస్తూ మైదాన ప్రాంతాలకు పీఎంజీఎస్‌వై, ఏఐబీ, మార్కెటింగ్ నిధులతో నియోజకవర్గంలో 103 కిలోమీటర్ల మేర 39 రోడ్లకుగాను రూ. 37 కోట్లు వెచ్చించారు. ఈ రోడ్లు దాదాపుగా పూర్తయ్యాయి. మరో 5 రోడ్లకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. పంచాయతీరాజ్ నిధులు రూ.44.44 కోట్లతో 65.38 కి.మీ. మేర 37 రోడ్ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. వీటితోపాటు నియోజకవర్గంలో రూ.51.63 కోట్లతో 519 సీసీ రోడ్లను పూర్తి చేశారు. ఇంకా మిగిలిన రహదారులకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో నియోజకవర్గ ప్రజలు సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడులకు రుణపడిపోయామని, తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



దేవరాపల్లి నుంచి ఆనందపురం వరకు వేసిన డబుల్ రోడ్డు

తాత, ముత్తాతల కల



మా తాత ముత్తాల కల ఇప్పటికే నెరవేరింది. అత్యవసర సమయంలో డోలీ మోతలే మాకు దిక్కు. మా గ్రామంతోపాటు, ఏడు గ్రామాల చుట్టూరా కొండగెడ్డలే. సీఎం జగనన్న సహకారం, డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా మా పంచాయితీలో ఉరకగెడ్డపై వంతెనతో పాటు, 14 చిన్నచిన్న గిరి గ్రామాలకు సైతం రోడ్లు నిర్మిస్తున్నారు.

– సొలం రమేష్, వెలగపాడు గిరిగ్రామం, శంకరం పంచాయతీ

నాణ్యతగా రోడ్లు

గిరిజన గ్రామాలకు రోడ్లు వేయడం కొంత కష్టంగా ఉన్నా, నాణ్యతలో రాజీ పడట్లేదు. డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు ప్రతి రోడ్డు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తున్నారు. వర్షాలు, కొండగెడ్డల వల్ల రోడ్ల నిర్మాణానికి అప్పుడప్పుడూ ఆటంకాలున్నా.. ఆయన సహకారంతో మంజూరైన నిధుల మేరకు రోడ్లు పూర్తి చేస్తున్నాం.

–బి. వెంకటరావు, ప్రాజెక్టు డీఈ, అనకాపల్లి జిల్లా

ప్రతి గ్రామానికీ పక్కా రోడ్లు



నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ వెళ్తున్నా. గిరిజన ప్రజలు పడుతున్న కష్టాలు చిన్ననాటి నుంచి తెలుసు. అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రతి గ్రామానికీ పక్కా రోడ్డు నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నా. ఇప్పటికే దాదాపు అన్ని గ్రామాలకూ రోడ్లు వేస్తున్నాం. రోడ్ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. మిగిలి ఉన్న రోడ్లకు ప్రతి పాదనలు పంపించాం.

–బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

న్యూస్‌రీల్

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నక్కపల్లి/ఎస్.రాయవరం: విద్యార్థులు రాసిన వర్క్‌బుక్‌లను సక్రమంగా పరిశీలించని ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తనిఖీల్లో.. విద్యార్థులు తప్పులు రాసినా టీచర్లు సరైన సమాధానమని టిక్ పెట్టిన విషయం గమనించారు. ఇందుకు బాధ్యులైన నక్కపల్లి మండలం అమలాపురం పాఠశాల ఉపాధ్యాయుడు టి.అప్పలనాయుడు, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం హెచ్ఎం మళ్ల రమణలపై చర్య తీసుకోమని డీఈవోను ఆదేశించారు. అందుకు అనుగుణంగా వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈవోలు కుంచం నరేష్, అప్పారావు తెలిపారు.

రామారాయుడుపేట కొండపై హెలికాప్టర్ చక్కర్లు



రామారాయుడుపేట కొండపై చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్

మునగపాక: మండలంలోని రామారాయుడుపేట కొండపై సోమవారం అరగంటకు పైగా హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. దీంతో ఏం జరుగుతుందోనని కొంతమంది ఆత్రంగా చూశారు. హెలికాప్టర్ నుంచి నలుగురు వ్యక్తులు రోప్ సాయంతో కొండపైకి దిగారు. ఈ సమయంలో హెలికాప్టర్ కొండపై చక్కర్లు కొడుతూనే ఉంది. కొండపై దిగిన వ్యక్తులు అరగంట తర్వాత రోప్ సాయంతో హెలికాప్టర్‌పైకి చేరుకుని, వెళ్లిపోయారు. అసలు ఈ ప్రాంతంలో హెలికాప్టర్ అంతసేపు ఎందుకు చక్కర్లు కొట్టింది? రోప్ సాయంతో కొండపైకి ఎందుకు దిగారనే సందేహాలు ముసురుకున్నాయి. ఇంతకు మునుపెన్నడూ లేని విధంగా కొండపై హెలికాప్టర్ చక్కర్లు కొట్టడంతో స్థానికుల ఆసక్తిగా తిలకించడంతోపాటు, ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు.

రెయిన్ సాల్ట్‌తో నీటి ఎద్దడి నివారణ



సదస్సులో మాట్లాడుతున్న ఆత్మ పీడీ ఆశాదేవి

మాకవరపాలెం: రెయిన్ సాల్ట్(హైడ్రోజెల్)తో నీటి ఎద్దడిని నివారించవచ్చని ఆత్మ ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ ఆశాదేవి తెలిపారు. మండలంలోని తామరం రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు రెయిన్ సాల్ట్ ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు అవసరమైన పద్ధతులను వివరించారు. ఎకరానికి ఒక కేజీ హైడ్రోజెల్‌ని వినియోగిస్తే నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు. ఇది ఎక్కువగా మొక్కజొన్న, వేరుశనగ, పత్తి, కూరగాయల పంటలకు మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. అనకాపల్లి రైతుశిక్షణా కేంద్రం ఏడీ శ్రీధర్‌రావు మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఒక విడత వరి పంట సాగుకు అవసరమైన నీటితో మూడు విడతల చిరుధాన్యాల పంటలను సాగు చేయవచ్చన్నారు. వరి నారుమడులు, నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు చిరంజీవి, విజేత, తులసిమణి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం: సౌత్ ఈస్టన్ రైల్వే, అద్రా డివిజన్ తల్గోరియా, బొకారో నార్త్ కేబిన్ పరిధిలో డబ్లింగ్ పనుల కారణంగా బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ధన్‌బాద్–అలెప్పీ (13351) బొకారో ఎక్స్‌ప్రెస్ వయా చంద్రపూర, బర్‌కాకానా, మురి స్టేషన్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

పలు రైళ్లకు మారిన వేళలు : టాటానగర్–ఎర్నాకుళం(18189) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 10.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 10.40 గంట లకు బయలుదేరుతుంది. షాలిమార్–తిరువనంతపురం(22642) సూపర్ ఫాస్ట్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుండి 11.40 గంటలకు బయలుదేరుతుంది. సిల్చార్–తిరువనంతపురం సెంట్రల్(12508) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి పాలక్కడ్‌కు రాత్రి 11.35 గంటలకు చేరుకుని, అక్కడ నుంచి 11.40 గంటలకు బయలుదేరుతుంది.

1న ఇనార్బిట్‌మాల్‌కు సీఎం శంకుస్థాపన



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో నగర ప్రజల జీవన విధానానికి తగినట్టు ఏర్పాటు చేస్తున్న ఇనార్బిట్‌మాల్‌కు ఆగస్టు 1వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఆయన సోమవారం జోన్ 5 పరిధి 45వ వార్డు కైలాసపురం రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్‌మాల్ ప్రాంతాన్ని పరిశీలించారు. శంకుస్థాపనకు అవసరమైన ఏర్పాట్లు, కార్యక్రమంలో పాల్గొననున్న అతిథులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్లు, కల్వర్టులకు నిధులు

కేంద్ర మంత్రికి ఎంపీ సత్యవతి కృతజ్ఞతలు



సాధ్వి నిరంజన్‌జ్యోతితో ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: పార్లమెంట్ వద్ద కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయ మంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతికి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి సోమవారం కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో రూ.45.2 కోట్లతో చేపట్టిన 10 ప్రధాన గ్రామీణ రహదారులు పూర్తయ్యాయి. 4 కొత్త కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జిల్లా అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి ఎంపీ సత్యవతి ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల జోరు



పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



తోటవీధిలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబురాజు

మాడుగుల: మండలంలో ఎల్.పోన్నవోలు పంచాయతీ ఎల్.కె. గదబవీధిలో 16 గిరి కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం వీరికి పార్టీ కండువాలు కప్పి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సాదరంగా ఆహ్వానించారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి రానున్న కాలంలో మంచి గుర్తింపు ఉంటుందని ఆయన తెలిపారు. పార్టీలోకి చేరిన వారిలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి వంతాల చినమ్ములు, వంతల కొండబాబు, వంతల పెద రాము, సీమల అప్పారావు, వంతల నాగరాజు, ఈదల దేముడు, వంతలరాజులమ్మ, కొదము అప్పలకొండ, కొదము చినరాజు, కొదము రాము తల్లీ, కొదము వరహాలు, అల్లం పెంటయ్య, కొదం చందు, కొదం అప్పారావుతోపాటు మరో ఇద్దరు ఉన్నారు. ఈ సందర్భంగా వంతల చిన్నమ్ములు, తదితరులు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలన నచ్చడంతోపాటు డిప్యూటీ సీఎం నిరంతరం అందుబాటులో ఉంటూ ఆదుకోవడంతో పార్టీలోకి స్వచ్ఛందంగా చేరామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ వేగేచిన ప్రభాకర్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుకొండ చెల్లంనాయుడు, కాళ్ల రాము, తాళ్లపురెడ్డి రాంబాబు, కాళింగ కళ్యాణరాజు, బొద్దపు భాస్కరరావు, బోర అప్పలనాయుడు, చిన్న, సయ్యపురెడ్డి నారాయణరావు, శంకరం సర్పంచ్ శొలం రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 250 మంది చేరిక

రాంబిల్లి: జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. మండలంలోని జడ్. చింతువా పంచాయతీ శివారు తోటవీధికి చెందిన 250 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ లోవరాజు ఆధ్వర్యంలో గనగళ్ల పెంటయ్య, గనగళ్ల కోటి, బొందు మసేనురావు తదితరులు పార్టీలో చేరారు. జగనన్న పాలన చూసి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారంతా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు అండగా నిలవాలన్నారు. తోటవీధికి తారురోడ్డు నిర్మిస్తామన్నారు. టీడీపీ, జనసేన పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని వాటిని నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి) , సీహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏ ఒక్క పనీ ఆగకూడదు..

- నిధులు మంజూరైన పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలి
- అన్ని శాఖల్లో అపరిష్కృత సమస్యలపై ప్రత్యేక దృష్టి
- యుద్ధప్రాతిపదికన రహదారుల మరమ్మతులు, నిర్మాణాలు పూర్తి
- అనకాపల్లి నియోజకవర్గ సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

సాక్షి, అనకాపల్లి: ఏ ఒక్క అభివృద్ధి పనీ ఆగకూడదు.. పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి త్వరితగతిన పూర్తి చేయాలి అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చొరవ తీసుకుని అధికారులతో కలిసి అవసరమైతే సంబంధిత శాఖ మంత్రిని సంప్రదించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలతో కలిసి అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు అందించే అభివృద్ధి, సంక్షేమం ఆలస్యం కాకూడదనేదే సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన అన్ని అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణం, ఆర్ అండ్ బీ, పురపాలక శాఖ, జలవనరుల శాఖ, వైద్యం, ఆరోగ్యం, విద్య, ఉపాధి హామీ, స్త్రీ శిశు సంక్షేమం, జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఇంకా ఎక్కడైనా రోడ్డు మరమ్మతులు పనులు, రోడ్డు నిర్మాణ పనులుంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి, కశింకోట మండలాల్లో అమలు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.

సీఎంతో మాట్లాడి నిధులు రప్పిస్తా..

మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ.. అవసరమైతే ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. అనకాపల్లి జిల్లా కేంద్రం అయిన దగ్గర నుంచి పారిశ్రామికంగా పరుగులు తీస్తోందన్నారు. దానికి అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనకాపల్లి పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, పట్టణంతోపాటు పారిశ్రామిక ప్రాంతాల వారి అవసరాలను తీర్చడానికి కృషి చేయాలన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఇంజినీరింగ్, హౌసింగ్, రోడ్లు ఇరిగేషన్ లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయాల నిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన ఫిర్యాదులు, హామీల పరిష్కారం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, నాడు–నేడు పనులు, ఉపాధి హామీ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, సీపీవో జి.రామారావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డీపీవో శిరీష, హౌసింగ్ పీడీ రమామణి, పంచాయతీరాజ్ ఈఈ వీరన్ననాయుడు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గోడపత్రిక ఆవిష్కరణ

తుమ్మపాల: జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్ –2023లో అద్భుతమైన ఫలితాలు సాధించే దిశగా అధికారులు అడుగులు వేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గోడపత్రికను ఆయనతోపాటు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, డీఆర్వో వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి పాల్గొన్నారు.

వెలుగులోకి చారిత్రక విశేషాలు

సత్ఫలితాలను ఇస్తున్న అక్రమ కట్టడాల తొలగింపు



బ్రిటిష్ సమాధుల స్థలంలో నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డును వంద అడుగులకు విస్తరించే పనిలో భాగంగా భవనాల తొలగింపు ప్రక్రియను చేపట్టిన విషయం తెలిసిందే. తొలి దశలో అబిద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించారు. అల్లూరి సీతారామరాజు సాగించిన పోరాటానికి సజీవ సాక్ష్యంగా ఉన్న బ్రిటిష్ సైనికాధికారులు హైవర్ట్, కవర్టు సమాధుల స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. దీంతో చరిత్ర కలిగిన బ్రిటిష్ సైనికాధికారుల సమాధులు బాహ్య ప్రపంచానికి తెలియకుండా కనుమరుగయ్యాయి. రోడ్డు విస్తరణలో భాగంగా సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలను సోమవారం కూల్చివేశారు. దీంతో బ్రిటిష్ సైనికాధికారుల సమాధులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే మున్సిపల్ అధికారులు 50 అక్రమ నిర్మాణాలను గుర్తించి, రెండు రోజుల్లో వీటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు.

నేడు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. కౌన్సిల్ సమావేశంలో 44 అంశాలు పొందుపరిచారు. 41 సప్లిమెంటరీ అంశాలతోపాటు మరికొన్ని టేబుల్ అంశాలు సభ్యుల చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా..మెరుగైన శుభ్రత, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నివారణ ద్వారా విశాఖ నగరాన్ని పర్యావరణ హితనగరంగా మార్చడం తదితర అంశాలున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌లో 'జ్ఞాన' అవార్డులు ప్రదానం



సీఆర్‌జీ విభాగానికి జ్ఞాన అవార్డును అందజేస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రతిభ చూపిన పలు విభాగాలకు జ్ఞాన గుర్తింపు అవార్డులు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో నాలెడ్జ్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ చూపే విభాగాలకు ఏటా జ్ఞాన అవార్డులను అందజేస్తుంటారు. స్టీల్‌ప్లాంట్ సీఎస్ఎం విభాగం ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సరికొత్త ఆవిష్కరణలు, తద్వారా పేటెంట్లు సాధించిన కోక్‌ఓవెన్స్, సీఆర్‌జీ, ఆర్ఎంహెచ్‌పీ ఆర్అండ్‌డీ, సింటర్ ప్లాంట్ విభాగాల బృందాలకు అవార్డులు అందజేశారు.

సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి పరిశోధనలు

- 'సాక్షి'తో యూఎస్‌కు చెందిన హైడ్రో కార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ సూర్యప్రకాష్



ప్రొఫెసర్ సూర్యప్రకాష్

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల నుంచి హైడ్రో పవర్ ఉత్పత్తికి సంబంధించిన ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు జరుగుతున్నాయని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు చెందిన హైడ్రోకార్బన్ కెమిస్ట్రీ నిపుణుడు ప్రొఫెసర్ జీకే సూర్యప్రకాష్ తెలిపారు. ఇప్పటికే ఈ తరహా ప్రయోగాలు అమెరికాలో కొనసాగుతున్నాయని చెప్పారు. మన దేశంలో తమిళనాడులోని కారైకుడిలో పరిశోధనలు సాగుతున్నాయని తెలిపారు. విశాఖలో నిర్వహిస్తున్న ఎనర్జీ ఎఫిషియెంట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. సముద్రపు నీటిలో ఉన్న లవణ శాతాన్ని, క్లోరిన్‌ను వేరు చేసి, ఆ నీటితో హైడ్రో పవర్ ఉత్పత్తికి మార్గాన్ని సుగమం చేయడమే ఎలక్ట్రాలసిస్ లక్ష్యమని వివరించారు. సముద్రపు నీటిని విద్యుత్ ఉత్పత్తికి ఏ రకంగా వినియోగించుకోవాలనే దానిపై పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. ప్రపంచంలో 73 శాతం సముద్ర జలాలే ఉన్నాయని, ఎలక్ట్రాలసిస్‌పై పరిశోధనలు ఫలిస్తే భవిష్యత్తులో హైడ్రో పవర్ అత్యంత చౌకగా ఉత్పత్తికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 2029 నాటికి 71 మిలియన్ టన్నుల హైడ్రోజన్ అందుబాటులో ఉంటుందని, దీనిని మరింత పెంచడానికి ఎలక్ట్రాలసిస్ దోహదపడుతుందని ప్రొఫెసర్ సూర్యప్రకాష్ తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనకు 305 అర్జీలు

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో నమోదైన ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించాల ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు.



జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసి జాహ్నవి

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ జాహ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ, డీఆర్‌డీఏ లక్ష్మీపతి, డీఎల్‌డీవో మంజులావాణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం అవకుండా ఉండాలంటే సమస్య పరిష్కారం చేసి అర్జీదారుడ్ని సంతృప్తికరంగా చేయాలన్నారు. స్పష్టమైన రీతిలో సమాధానాలు ఇవ్వాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా శాఖల అధికారుల సమక్షంలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లా డి సమస్యలను తెలుసుకోవాలన్నారు. పరిష్కరించదగ్గ వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ వారం మొత్తం 305 అర్జీలు స్పందనలో నమోదయ్యాయి.

మాకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయండి

వృద్ధాప్యంతో బాధపడుతున్న మాకు రేషన్‌కార్డును వేరుచేసి పింఛన్ మంజూరు చేయాలని రావికమతం మండలం జె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన వృద్ధులైన తల్లీకూతుర్లు సిగిరెడ్డి గునమ్మ, పడాల దేముడమ్మ స్పందనలో మొరపెట్టుకున్నారు. ఇద్దరం ఒకే ఇంట్లో ఒక రేషన్ కార్డుతో బియ్యం పొందుతున్నామని, ఇద్దరం వృద్ధులమని, ఒక్కరికి మాత్రమే పింఛన్ అందుతుందని వాపోయారు.

- గ్రామ పంచాయతీ ఖాతాల నుంచి ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిన నిధులను తక్షణమే మళ్లించి సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ సర్పంచ్‌లు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను పంచాయతీ పరిధిలోకి తీసుకువచ్చి తమ అధికారాలకు న్యాయం చేయాలన్నారు.

కలెక్టర్ దృష్టికి అణుకు సమస్య

కోటవురట్ల: అణుకు గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తెలిపారు. అప్పలరాజు మాట్లాడుతూ గొట్టివాడ శివారు అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల లేకపోవడంతో సుమారు 30 మంది చిన్నారులు చదువుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మరికొంత మంది పిల్లలు చదువుకు దూరమవుతున్నారని, రోడ్డు లేకపోవడంతో వైద్య సేవలకు డోలీ మోత తప్పడం లేదన్నారు. ఇవే అంశాలు జిల్లా కలెక్టర్‌కు వివరించగా స్పందించిన ఆయన గిరిజనులు సమస్యలపై నివేదిక ఇవ్వాలని ప్రత్యేకాధికారికి ఆదేశాలిచ్చారని తెలిపారు. తొందరలోనే సమస్య పరిష్కారం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గిరిజనులు 18వ రోజున సోమవారం కూడా రిలే నిరాహార దీక్ష కొనసాగించారు.

బాధితులకు అండగా పోలీసు

ఎస్పీ స్పందనకు 37 అర్జీలు

అనకాపల్లి టౌన్: నూతన జిల్లా అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంతో పలు సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. ప్రతి వారం జిల్లా వాసులు సమర్పించే అర్జీలకు సత్వర న్యాయం చేసేందుకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తనదైన శైలిలో నెలవారీ నేర సమీక్షలు చేపడుతున్నారు. తద్వారా పెండింగ్ కేసుల వివరాలు, పూర్వాపరాలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని పోలీసు అధికారులను ఆదేశిస్తున్నారు. ఎన్నోయేళ్ల నుంచి పెండింగ్‌లో పడిపోయిన కేసులకు సంబంధించి స్పందన ద్వారా సామరస్యంగా తెలుసుకుని పరిష్కరించడంతో ప్రభుత్వంతోపాటు పోలీసు శాఖపై బాధితుల్లో గౌరవం ఏర్పడుతోంది. ఈ వారం స్పందన కార్యక్రమంలో ఎస్పీ 37 అర్జీలు స్వీకరించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ చక్రధర్ పాల్గొన్నారు.

ఫేక్ కాల్‌కు కళ్లెం వేయాలి: నరపరెడ్డి కొండబాబు



నాది పాయకరావుపేట మండలం పెదరామభద్రపురం గ్రామం. ఏడాదిగా గ్రామంలో మహిళలకు ఫేక్ కాల్స్ వస్తున్నాయి. ఫోన్ చేసిన వారు అసభ్య పదజాలంతో మాట్లాడటంతో మహిళల ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులతోపాటు నేను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశా.



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

నకిలీ బ్యాంకు ఉద్యోగిపై ఫిర్యాదు: జె.ప్రకాశరావు



మాది రాంబిల్లి మండలం దిమిలి. గ్రామంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లో అటెండర్‌గా పని చేస్తున్నానంటూ రాంప్రసాద్ గ్రామస్తులను నమ్మబలికాడు. బ్యాంకుకు వెళ్లలేని వారి నగదు జమ చేయమేగాకుండా బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంతో అతడిపై గట్టి నమ్మకం కుదిరింది. ఇటీవల వారి ఖాతాల్లో నగదు జమ కాలేదని తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కసారిగా కంగుతిన్నారు. దీంతో చేసేది ఏమీలేక బాధితుల తరపున స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశా.



ఫిర్యాదు ప్రతులు చూపిస్తున్న రమేష్, సత్యవతి

రౌడీ షీటర్‌పై ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు

రావికమతం: మండలంలోని కొత్తకోటలో తప్పుడు ఫిర్యాదులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్న రౌడీ షీటర్ మల్లేటి రమణపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గరగా సత్యవతి, కొరతల రాజా రమేష్ సోమవారం స్పందనలో ఎస్పీ కె.వి. మురళీకృష్ణ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో షాపు అద్దెకు తీసుకుని రౌడీ దర్బార్ నిర్వహిస్తూ బెదిరిస్తున్నాడని వాపోయారు. కొత్తకోటకు చెందిన గరగా సత్యవతి భర్త 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసుకున్న నివేశ స్థలంలో గొడవ చేయడమేకాక ఆమెను నడిరోడ్డులో కొడతానంటూ తీవ్ర దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశాడు. ఆమెకు అండగా నిలిచిన రాజారమేష్, శేషులపై తప్పుడు అట్రాసిటీ కేసులు నమోదు చేయించి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: నేషనల్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 23న నిర్వహించిన అండర్ -14 యోగా పోటీల్లో జి.సోమసూర్య చరణ్ (6వ తరగతి), జి.హర్షవర్ధిని (8వ తరగతి) చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. జి.సోమసూర్య చరణ్ సంప్రదాయ యోగా విభాగంలో, రిథమిక్ యోగా విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడని, జి.హర్షవర్ధిని సాంప్రదాయ యోగా విభాగంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. ప్రతిభ కనబరిచిన వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు అపర్ణ, నీలాదేవి, యోగా గురువు సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రూ.49.10 లక్షలతో పూర్తయిన అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని కొండుపాలెం, చేనుల అగ్రహారం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం కొండుపాలెంలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు, రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, రూ.13.8 లక్షలతో నిర్మించిన నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, రూ.10.30 లక్షలతో నిర్మించిన 20 కిలో లీటర్ల వాటర్ హెడ్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



కొండుపాలెం ప్రాథమిక పాఠశాలలో నాడు - నేడు పనులను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతుడు దినేష్

అనకాపల్లి టౌన్: స్థానిక గాంధీనగరం అన్నపూర్ణా బ్యాంకు కూడలి వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మండలంలోని తుమ్మపాల పంచాయతీ చిన్నిబాబు కాలనీకి చెందిన కొణతాల దినేష్(22)కు తలకు తీవ్రగాయమైంది. బాధితుడ్ని హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ ప్రమాదంలో మరో వాహనంపై ప్రయాణిస్తున్న రాజేష్, నానీ గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ తెలిపారు. గాంధీనగరానికి చెందిన రాజేష్, నానీ, దినేష్ అచ్యుతాపురం ప్రైవేటు కంపెనీలో విధులు ముగించుకుని స్వగృహాలకు చేరుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మేరకు మృతుడు తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఇంటి నుంచి వెళ్లి.. వారం తర్వాత శవమై..

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



శ్రీనివాసరావు(ఫైల్)

అనకాపల్లి టౌన్: ఇంటి నుంచి వారం రోజుల కిందట బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన వ్యక్తి సోమవారం విగత జీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. సోమవారం బొజ్జన్నకొండకు వెళ్లే ఏలేరు కాలువ రెండో తూము వద్ద చదరం మురళీ శేషు శ్రీనివాసరావు (47) మృతదేహాన్ని అటుగా వెళ్తున్న వాకర్స్, రైతులు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పట్టణ సీఐ దాడి మోహనరావు, ఎస్ఐలు సింహాచలం, ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. తుమ్మపాల గ్రామం గవరపేటకు చెందిన శ్రీనివాసరావు వృత్తిరీత్యా కాంట్రాక్ట్ పద్ధతిలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అదే రోజు పట్టణ పోలీసులకు మృతుడు చిన్నకుమారుడు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు మృతితో భార్యా పిల్లలు బోరున విలపిస్తున్నారు. ఎవరితోనూ అతనికి ఎలాంటి తగాదాల్లేవని గ్రామస్తులు చెబుతున్నారు. ఇంటికి దగ్గర్లోనే ఏలేరు కాలువ ఉండటంతో రాత్రిళ్లు బహిర్భూమికి అప్పుడప్పుడు వెళ్తుంటాడని, అలా వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మరణించి ఉండొచ్చని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడు పెద్ద కొడుకు కొండలరావు బీటెక్, చిన్న కొడుకు మనోహర్ ఐటీఐ చదువుతున్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విషాదంలో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

- బ్యాంక్‌ల ద్వారా సకాలంలో రుణాలు
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి మహిళా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుచ్చెయ్యపేట మండలంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం చేసిన అధికారులకు, డ్వాక్రా మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ మండలంలోని 1,764 డ్వాక్రా గ్రూపు సభ్యులందరికీ సకాలంలో బ్యాంక్ రుణాలు అందేలా చూడాలని వెలుగు ఏపీఎం బాలరాజును ఆదేశించారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళల కన్నీళ్లు చూసి చలించిపోయి జగనన్న అధికారంలోకి రాగానే అన్ని పథకాలు వారికే వర్తించేలా చేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే రాష్ట్రం, దేశ ఆర్థిక పరిస్థితులు బాగుంటాయన్నారు. ఈ నెల 30న చోడవరంలో గడపగడపకు ముగింపు విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, నాయకులు గొలజాన శ్రీను, గోపిశెట్టి శ్రీను, కోవెల ఈశ్వరరావు, సత్యనారాయణ, పాతాళ సత్తిబాబు, గుడాల ఆనంద్, బుజ్జి పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న విప్ ధర్మశ్రీ

వాటర్ బాటిల్ కోసం సోదరుడితో వివాదం

తండ్రి మందలింపుతో విద్యార్థిని ఆత్మహత్య

యలమంచిలి: చిన్నపాటి వివాదాలకు యువత తమ అమూల్యమైన ప్రాణాలను బలి తీసుకుంటోంది. తాజాగా తన సోదరుడితో వాటర్ బాటిల్ విషయమై స్వల్ప వివాదం ఏర్పడటంతో మనస్తాపానికి గురైౖ డిప్లొమా విద్యార్థిని ఆత్మహత్యకు ఒడిగట్టింది. ఈ ఘటన యలమంచిలి పట్టణం రామ్‌నగర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. డిప్లొమా విద్యార్థిని శీలం దీపిక (18), తన సోదరుడు జయసంతోష్ మధ్య వాటర్ బాటిల్ కోసం స్వల్ప వివాదం తలెత్తింది. ఇదే క్రమంలో ఆమెను తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై తన ఇంట్లో గదిలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఆమె మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్సై నాయుడు సోమవారం తెలిపారు. మృతురాలి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

అనుమానాస్పదంగా యువకుడి మృతి



బాలరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

ఎస్.రాయవరం: ఒకే గ్రామ పంచాయతీ పరిధి శివారు గ్రామాల్లో వివాహిత, యువకుడు వేర్వేరుగా ఉరేసుకుని మృతి చెందడం కలకలం రేపింది. ఒక సంఘటన తర్వాత మరో సంఘటన తెలియడంతో లక్ష్మీపతిరాజుపేట, కొత్తపోలవరం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాలను నక్కపల్లి సీఐ అప్పన్న వెళ్లి సోమవారం పరిశీలించారు. ఎస్ఐ ప్రసాదరావు అందించిన వివరాల ప్రకారం...

గుడివాడ శివారు లక్ష్మీపతిరాజుపేటలో ఒమ్మి బాలరాజు (26) గ్రామ సమీపాన మామిడి తోటలో సపోటా చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందు రోజు తన స్నేహితులతో గెట్ టు గేదర్‌కు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. రాత్రికి భోజనం చేసి స్నేహితుడు ఇంటికి వెళ్లి పడుకుంటానని చెప్పి ఉదయానికి తోటలో చెట్టుకు వేలాడుతూ అనుమానాస్పదంగా మృతి చెంది కనిపించాడని తల్లి పైడమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని నక్కపల్లి ఆస్పత్రికి తరలించి పంచనామా నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

మరో ఘటనలో వివాహిత..

గుడివాడ శివారు కొత్తపోలవరంలో బత్తిన సత్యవతి(38) అనే వివాహిత ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. మూణ్నెల్ల క్రితం ఆమె కుమార్తె చనిపోయిందని, అప్పటి నుంచి బెంగ పెట్టుకుని దిగులుగా ఉండేది. పలుమార్లు భర్త నచ్చజెప్పినా వినిపించుకునేది కాదు. సోమవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె భర్త నూకరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయం

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

అనకాపల్లి టౌన్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరించడం అన్యాయమని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక రోటరీ కల్యాణహాలులో సోమవారం పార్టీ జిల్లా నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావానికి కృషి చేసింది అప్పటి కాంగ్రెస్ నేతలేనన్నారు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం టీడీపీ, తోకపార్టీగా ఉన్న జనసేన కార్మికుల పోరాటాన్ని పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వచ్చే నెల విశాఖ వస్తున్న పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని రాహుల్‌గాంధీ సందర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రుత్తల శ్రీరామ్మూర్తి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, ఏఐసీసీ సభ్యుడు వేగి వెంకటేష్, అనకాపల్లి నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్, పాయకరావుపేట, చోడవరం, యలమంచిలి, పెందుర్తి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలి

చోడవరం రూరల్: మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలను నిరసిస్తూ సోమవారం చోడవరంలో దళిత విముక్తి రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఆందోళనకారులను ఉద్దేశించి దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ అత్యాచారాలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. సీఎం బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కోరారు. ద్వారకానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.సంజీవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్, సెక్రటరీ డి.బోడయ్య, కోశాధికారి వి.సతీష్, సంఘ నాయకులు పాల్గొన్నారు.



నిరసిస్తున్న దళిత విముక్తి సంస్థ

గంజాయి కోసం కోళ్ల దొంగతనాలు

- ఎం.జగన్నాథపురంలో వరుస చోరీలు
- ఎట్టకేలకు దొంగలను పట్టుకున్న స్థానికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): గంజాయి కోసం కోళ్ల దొంగతనం చేసి అమ్ముకొనే దుస్థితికి చేరారు ఆ యువకులు. రాత్రి వేళ నిద్ర లేకుండా చేస్తున్న కోళ్ల దొంగల గురించి అసలు విషయం తెలుసుకొని ముక్కున వేలేసుకున్నారు గ్రామస్తులు. చివరకు గ్రామస్తులంతా ఒక్కటై రాత్రి వేళ గంజాయి మత్తులో ఉన్న కొందరిని అచ్యుతాపురం పోలీసులకు అప్పగించారు. వివరాలివి. మండలంలోని ఎం.జగన్నాథపురంలో కొద్ది రోజులుగా కోళ్లు అదృశ్యమవుతున్నాయి. వందల సంఖ్యలో కోళ్లు అదృశ్యం అవ్వడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చేరువలో కొండలు ఉండడంతో జంతువులు కోళ్లను ఎత్తుకుపోతున్నాయని ప్రాథమికంగా భావించారు. కోళ్ల గూటికి తాళం వేసినప్పటికీ అవి పగులగొట్టి మరీ పట్టుకెళ్లడంతో ఇది దొంగల పనేనని నిర్ధారణకు వచ్చారు. గత వారం గొర్రెను సైతం దొంగలు పట్టుకెళ్లిపోవడంతో స్థానికులంతా రాత్రి వేళల్లో పహారా కాయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ కనిపించిన పలువురిని పట్టుకొని ప్రశ్నించడంతో వారు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారు. తమతో పాటు కొందరు ఉన్నారని, గంజాయి కోసం కోళ్ల దొంగతనం చేస్తున్నామని వారు పేర్కొనడంతో స్థానికులు అవాక్కయ్యారు. పట్టుకున్న వారిని పోలీసులకు అప్పగించారు.



ఎం.జగన్నాథపురంలో నిర్వహించిన గ్రామ సభలో చర్చిస్తున్న జనం

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాల పంట

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన 12 మంది విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాల పంట పండించారు. ఇటీవల తెలంగాణలో స్పోర్ట్స్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11వ నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కింగ్-ఫు కరాటే చాంపియన్-2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ -12 కేటగిరీలో పాల్గొన్న విద్యార్థులు కె. షణ్ముఖ్, ఎం.రిత్విక్, జి.బాలాజీ టీం కాటా విభాగంలో ప్రథమ స్థానం, ఎం. శశాంక్, టి. సాత్విక్, కె.గిరీష్ టీం ద్వితీయ, కె.వి.ఎస్. అఖిలేష్, బి. భవిష్‌కుమార్, కె.ఎల్.ఎస్.జోష్ టీం తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వెపన్స్‌లో వి.నవదీప్, వ్యక్తిగత కాటాలో కె.ఎస్.ఎస్ చరణ్, బాలికల విభాగంలో కె.చరిత ప్రథమ స్థానాలను పొందారు. వీరిని కరాటే కోచ్ సిహెచ్. సూరిఅప్పారావులను స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనందిని అభినందించారు.



పతకాలు పొందిన కరాటే విద్యార్థులు

క్లుప్తంగా

'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

వేల్పులవీధిలో 'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి శ్రీ సీతారామ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు 7, 8, 9 సచివాలయాల పరిధి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, దరఖాస్తుదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఢీకొట్టిన లారీ



టీడీపీ నేతకు చెందిన లారీ ఢీకొని రోడ్డుపై పడిన ఎన్టీఆర్ విగ్రహం

అనకాపల్లిటౌన్: స్థానిక విజయరామరాజుపేట రోడ్డు ప్రారంభంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని అనకాపల్లి నుంచి బవులవాడ వెళ్తున్న భారీ లారీ సోమవారం తెల్లవారుజామున ఢీకొంది. దీంతో విగ్రహం నేలకొరిగింది. ఎన్టీఆర్ విగ్రహం పడిపోయేందుకు కారణమైన లారీ టీడీపీ నేతకు చెందినది. పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో ఎలాంటి వివాదం చెలరేగలేదు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 325 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,950	4,000
మూడోరకం	3,600	3,600

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 74 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 20 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 419 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

కోనేరు పార్కుకు మహర్దశ



పిచ్చిమొక్కలతో కశింకోటలోని కోనేరు పార్కు



పార్కులో దెబ్బతిన్న చప్టాపై సేద తీరుతున్న ప్రజలు

కశింకోటలోని జాతీయ రహదారి పక్కనున్న పురాతన కోనేరు పార్కుకు మహర్దశ పట్టనుంది. దీన్ని రూ.కోటితో అభివృద్ధి చేసేందుకు ఎంపీ బీవీ సత్యవతి సంకల్పించారు. వుడా సహకారంతోపాటు తన ఎంపీ నిధులను కేటాయించి, కోనేరు పార్కును సకల సదుపాయాలతో అందంగా తీర్చిదిద్దనున్నారు. గతంలో ఎందరో నేతలు, అధికారులు హామీలు ఇచ్చినా అభివృద్ధికి నోచుకోలేదు. ఎంపీ చొరవతో పార్కు రూపురేఖలు మారనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.కోటితో అభివృద్ధికి కార్యాచరణ
- ఎంపీ నిధులు, వుడా సహకారంతో చర్యలు

కశింకోట: కశింకోటలో సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. అయితే వారు సేద తీరడానికి సరైన పార్కు లేదు. స్థానిక కోదండ సీతారామస్వామి ఆలయం పక్కన పురాతన కోనేరు పార్కు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. అయితే దాని ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ పార్కుకు గతంలో సాయం సంధ్య వేళ సేద తీరేందుకు గ్రామస్తులు ఎక్కువగా వచ్చేవారు. దీని గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగి, పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో జనాలు కూడా ఇక్కడికి సేదతీరేందుకు రావడం తగ్గింది.

గతంలో అరకొర పనులే..

ఈ పార్కును 2003లో అప్పటి ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు సిఫార్స్‌తో వుడా నిధులతో విశాఖ వుడా పార్కు తరహాలో చిల్డ్రన్ పార్కుగా అభివృద్ధి చేసి, కోనేరులో బోటు షికారు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అప్పటి వుడా వైస్ చైర్మన్ దాసరి శ్రీనివాసులు పనులను ప్రారంభించారు. దీనిలో భాగంగా కోనేరు చుట్టూ శుభ్రపరచి పచ్చదనాన్ని పెంచేలా పూల మొక్కల నాటారు. తర్వాత దీన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన సొంత నిధులు, ఉపాధి హామీ పథకంలో పూడికలు తీయించి, గట్లను చదును చేశారు. అంతకు మించి ఆయన ఊడా అభివృద్ధి చేయలేదు. పంచాయతీ కూడా నిధుల లేమితో ఆ వైపు దృష్టి పెట్టలేదు. దీంతో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగి పార్కు అధ్వాన స్థితికి చేరింది. చెట్ల కూర్చునేందుకు నిర్మించిన సిమెంట్ చప్టాలు కూడా ధ్వంసమయ్యాయి. కొందరు దాతలు బెంచీలు సమకూర్చడంతో వాటిపైనే అడపా దడపా ప్రకృతి ప్రేమికులు కూర్చుని, ఆస్వాదిస్తున్నారు.

ఎంపీ సత్యవతి చొరవ

ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోనేరు పార్కు పరిస్థితి గురించి తెలుసుకున్న ఎంపీ సత్యవతి కరోనాకు ముందు వుడా నిధులతో అభివృద్ధికి సంకల్పించారు. కరోనా మహమ్మారి విజృంభణతో పనులు ముందుకు సాగలేదు. తాజాగా కోనేరు పార్కు అభివృద్ధిపై ఎంపీ దృష్టి పెట్టారు. దీనికి వుడాతోపాటు తన ఎంపీ నిధులు రూ.కోటి కేటాయించి, అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఈ నిధులతో పార్కు చుట్టూ రన్నింగ్ ట్రాక్, పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కల పెంపకం, రాత్రుళ్లు వెలుగు కోసం సోలార్ దీపాలు, ప్రజలు కూర్చుని సేదతీరేలా బెంచీలు, కోనేటిలోకి నీరు చేరేలా మార్గాన్ని పునరుద్ధరించడం తదితర పనులు చేపట్టనున్నారు.

గత్యంతరం లేదు



కశింకోట గ్రామంలో సేద తీరడానికి మంచి పార్కు లేదు. కోనేరు పార్కు ఉన్నా తుప్పలు పెరిగి పిల్లల్ని అటువేపు పంపించాలంటేనే భయమేస్తుంది. కూర్చునే సిమెంట్ చప్టాలు కొన్ని ధ్వంసమై అధ్వానంగా ఉన్నాయి. అయినా వేరే గత్యంతరం లేక రోజూ ఇక్కడే సేద తీరాల్సి వస్తోంది. ఇప్పటికైనా దీన్ని పట్టించుకోవడం ఆనందంగా ఉంది.

–దర్మిశెట్టి మోహనరావు, పూసర్ల వీధి, కశింకోట

ఎంపీ సత్యవతికి ధన్యవాదాలు



ఏళ్ల తరబడి కోనేరు పార్కు అభివృద్ధికి ఆశగా ఎదురుచూస్తున్నాం. మా ఊరి జనాలు సేదతీరేందుకు మరో ప్రత్యామ్నాయం లేదు. దీని దుస్థితిని ఎంపీ సత్యవతికి గ్రామ పెద్దలు వివరించారు. ఆమె చొరవ చూపినా.. కరోనా పనుల్ని ప్రారంభించనీయలేదు. మళ్లీ ఎంపీ చొరవ తీసుకున్నందుకు ధన్యవాదాలు.

–కోనేటి మహేష్, భవానీ కాలనీ, కశింకోట

కరోనా వల్ల ఆలస్యం



కశింకోటలో కోనేరు పార్కును రూ.కోటితో అభివృద్ధి చేయనున్నాం. వుడా సహకారం తీసుకోవడంతోపాటు ఎంపీ నిధులు కూడా కేటాయిస్తున్నా. గతంలోనే దీని అభివృద్ధికి ప్రయత్నించినా కరోనా వల్ల పనులు ప్రారంభం కాలేదు. తాజాగా పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు వీలుగా నిధులు కేటాయించి, చర్యలు తీసుకుంటున్నాం.

–భీశెట్టి వెంకటసత్యవతి, ఎంపీ, అనకాపల్లి

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



శిక్షణలో పాల్గొన్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు, కళాశాల అధ్యాపకులు

అనకాపల్లిటౌన్: విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక డైట్ కళాశాలలో సోమవారం ఏపీ అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాపు ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని సూచించారు. కళాశాల సీఎస్‌ఈ విభాగాధిపతి కె.సుజాత మాట్లాడుతూ వర్క్‌షాపు వారం రోజులపాటు కొనసాగుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ఎ.కృష్ణ నాగ్, డీన్ ఆఫ్ అకడమిక్స్ కె.పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సదస్సుపై ప్రచార జాతా

కశింకోట: వ్యవసాయ రంగ పరిరక్షణకు మునగపాకలో మంగళవారం నిర్వహించనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కశింకోట, నరసింగబిల్లి, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో సోమవారం రైతు నాయకులతో కలిసి రైతు సదస్సు జాతాపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అప్పులను రద్దు చేయాలన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర ఇచ్చేలా చట్టబద్ధత కల్పించాలని, రైతు ఆత్మహత్యలను నిలువరించాలని కోరారు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి, ఆధునికీకరించాలన్నారు. ఈ సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదించేందుకు ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఎక్కువ సంఖ్యలో రైతులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు భీముని సోమునాయుడు, పెంటకోట జగ్గారావు, కసిరెడ్డి అప్పలస్వామినాయుడు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాలెం వద్ద ట్రాఫిక్ జామ్



తాళ్లపాలెం సంత రహదారిలో నిలిచిన ట్రాఫిక్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద సోమవారం ట్రాఫిక్ జామ్‌తో రెండు గంటలకుపైగా వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. మాకవరపాలెం వద్ద ఆన్‌రాక్ పరిశ్రమలో అల్యూమినియం ముడి సరుకును దింపి తిరిగి అనకాపల్లి వైపు వస్తున్న లారీ మరమ్మతులకు గురై, అకస్మాత్తుగా తాళ్లపాలెం సంత సమీపంలో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. బస్సుల్లో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు. చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కూడా నర్సీపట్నం వైపు వెళ్తూ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బంది సహకారంతో నిలిచిపోయిన లారీని అడ్డు తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

27న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీగ్రంథాలయంలో ఈ నెల 27న క్యాన్సర్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ తల, మెడ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతశెట్టి హాజరవుతారని పేర్కొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



ఎస్.నర్సాపురం గ్రామంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అవసరమైన వారికి ధ్రువ పత్రాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు, మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. మండలంలో గల ఎస్.నర్సాపురం గ్రామంలో ఎంపీడీవో సాంబశివరావు బృందం , ఈదటం గ్రామంలో మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ బృందం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్.నర్సాపురం గ్రామంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి 496 మంది వివిధ సంక్షేమ పథకాలకు, వివిధ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అర్హత గల వారందరికీ ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ మంచాల అనిత చేతుల మీదుగా ధ్రువ పత్రాలు అందించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లేల వెంకట్, కృష్ణార్జునరావు, డీటీ కె.నూకరాజు, ఈవోఆర్‌డీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈదటం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 500 మంది దరఖాస్తులు చేసుకోగా అధికారులు విచారణ జరిపి తహసీల్దార్ కె.జయప్రకాష్, సర్పంచ్ పిర్ల వెంకటరమణ చేతుల మీదుగా ధ్రువ పత్రాలు అందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక : చూచుకొండ సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. చూచుకొండ దరి వడిశెల అప్పలరాజు మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అలీ తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో అప్పలరాజు మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు అలీ తెలిపారు.

గాంధీనగరంలో చోరీ

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం ఇన్‌కంటాక్స్ కార్యాలయ వెనుక వీధిలో దాసరి సంతోష్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. సంతోష్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు. పట్టణంలో న్యూకాలనీ రోటరీ హాలులో సోమవారం జరిగిన పార్టీ సమావేశానికి వెళ్లారు. సమావేశం నుంచి తిరిగి ఇంటికి చేరుకోగా, ఇంట్లో చిందరవందరగా పడివున్న వస్తువులను చూసి చోరీ జరిగిందని గుర్తించాడు. ఇంట్లో ఉన్న అరతులం బంగారం, రూ.లక్షన్నర నగదు చోరీకి గురైందని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనాలివ్వాలి



సమావేశంలో పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

అచ్యుతాపురం(అనకాపల్లి): పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు కోరారు. అచ్యుతాపురంలో సోమవారం పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగులకు కల్పించిన సౌకర్యాలు పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు, పనిముట్లు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాము, కొండమ్మ, నూకరాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



బీజేపీ సీనియర్ నేత ఇందల సన్యాసిరావును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

మునగపాక : బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇందల సన్యాసిరావు కోరారు. పార్టీలో సీనియర్లను గౌరవించే కార్యక్రమంలో భాగంగా సీనియర్ నేత ఇందల సన్యాసిరావును సోమవారం అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో పార్టీ శ్రేణులు సత్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో చురుకైన పాత్ర పోషించేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దొడ్డి సత్యనారాయణ, వేగి అప్పలనాయుడు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు కృషి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధుని సమస్యను వింటున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్వర్యంలో మండలంలోని కొండుపాలెం, చేనుల అగ్రహారం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించి, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గృహాలు, రేషన్‌కార్డులు, పింఛన్లను సాంకేతిక కారణాలతో అందని వారు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు. స్థానికులు మంత్రితో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఆయన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.20 లక్షలు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. చేనుల అగ్రహారంలో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అక్కడే ఉన్న ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డ్రైనేజీ పూడికతీత పనులకు రూ.30 వేలు కేటాయించారు. కుమ్మరివీధి నూకాంబిక అమ్మవారి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నేతలు బొండా అప్పరాజు, శ్రీరామ్, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అరకొరగా గొర్రెలు, మేకల విక్రయాలు



సంతలో విక్రయించగా మిగిలిన గొర్రెలు



సంతలో విక్రయిస్తున్న తాజా కూరగాయలు

- స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు తగ్గాయి. ప్రస్తుతం సీజన్ కాకపోవడంతో సంతకు వ్యాపారులు తక్కువగానే వీటిని తీసుకొచ్చారు. అయినప్పటికీ అమ్మకాలు పెద్దగా జరగలేదు. సాధారణంగా ఏటా సంక్రాంతి నుంచి వేసవి ముగిసే వరకు పండగలు, ఉత్సవాలు జిల్లాలో ఉండటంతో గొర్రెలు, మేకలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడం, పండగలు, ఉత్సవాలు వగైరా లేకపోవడంతో వీటికి డిమాండ్ బాగా తగ్గిందని వ్యాపారులు చెప్తున్నారు. రానున్న విజయదశమి వరకు పరిస్థితి ఇలానే ఉంటుందని రోలుగుంట మండలం జగ్గంపేటకు చెందిన మేకల వ్యాపారి నమ్మి నాని తెలిపారు. అందుకే తక్కువ సంఖ్యలో విక్రయానికి తీసుకు వచ్చామని, అయినప్పటికీ ధర ఆశాజనకంగా లేకపోవడంతో విక్రయించగా మిగిలిన జీవాలను తిరిగి తీసుకుపోవాల్సి వస్తోందన్నారు.

తగ్గిన టమాటా ధర

తాళ్లపాలెం సంతలో టమాటా ధర కిలోకు రూ.30 తగ్గింది. గత వారం కిలో రూ.150 ఉండగా, ఈ వారం రూ.120కి విక్రయాలు సాగాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో రైతులు బీరకాయల్ని ఎక్కువగా సంతకు తీసుకొచ్చారు. వీటి అమ్మకాలు ముమ్మరంగా సాగాయి. ప్రతి కాయగూరల దుకాణంలోనూ ఇవి తాజాతాజాగా దర్శనమిచ్చాయి. సరకు ఎక్కువగా అమ్మకానికి వచ్చినప్పటికీ ధర కూడా అదే స్థాయిలో ఉంది. కిలో రూ.60కి అమ్మకాలు జరిగాయి. ఎప్పటిలాగే ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప రూ.30, వంకాయ, దొండకాయ, బెండకాయ, క్యాబేజీ, బరబాటి రూ.40, గోబీ పువ్వు రూ.50, కాకరకాయ, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు రూ.60, కేప్సికం రూ.100, పాదు చిక్కుడు రూ.120, బీన్స్ రూ.150, పచ్చి మిరప, అల్లం రూ.200కు విక్రయాలు సాగాయి.

విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరసన దీక్ష



నిరసన దీక్షలో మాట్లాడుతున్న రమణ

అనకాపల్లిటౌన్: స్థానిక విద్యాసంస్థల విద్యార్థుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నిరసనలో భాగంగా స్థానిక నెహ్రూచౌక్‌లో సోమవారం దీక్ష కార్యక్రమాన్ని కౌలు రైతు సంఘం నాయకుడు ఎ.బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం



క్షతగాత్రుడు ఉమామహేశ్వరరావు



ఉమ్మలాడ జంక్షన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కారును తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాజువాక ప్రాంతానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు మారికిపూడి ఉమామహేశ్వరావు తలకు సోమవారం తీవ్ర గాయమైంది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. విశాఖ నుంచి యలమంచిలి జాతీయ రహదారిపై అనకాపల్లి బైపాస్ ఉమ్మలాడ జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొని బోల్తాపడింది. కారు డ్రైవర్ స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు. తప్పు తనదే కావడంతో లారీని పంపించేశారు. రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కారును జేసీబీ సాయంతో తొలగిస్తున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నిలిపివేశారు. అదే రహదారిలో ఆగి ఉన్న వేరే లారీని అనకాపల్లి మండలం ఏఎంఏఎల్ కళాశాలలో దూర విద్యా పరీక్షలు రాసేందుకు గాజువాక నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న మారికిపూడి ఉమామహేశ్వరరావు, టి.హేమంత్‌కుమార్‌లు వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరరావు తలకు తీవ్ర గాయమవడంతో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. హేమంత్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడు ఉమామహేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు.

నేడు బోదువలసలో గడప గడపకు మన ప్రభుత్వం

సబ్బవరం: మండలంలోని బోదువలస సచివాలయం పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల జేసీఎస్ కన్వీనర్ ముత్యాల నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గడప గడపకు వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.